# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** రైతులు మిర్చి ధరలపై ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు.

**2.** తెలంగాణా రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లాలో శ్రీశైలం ఎడమ గట్టు కాలవ సొరంగ మార్గంలో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.

**3.** ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు.

**4.** ఈ రోజు గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది.

**5.** ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========================

ధరలపై మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. మార్కెట్ జోక్యం పథకం..ఎంఐఎస్ కింద సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం అందించాలన్నదే తమ ప్రయత్నమని ఆయన తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మిరప రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. మిర్చి సాగు, పెట్టుబడి ఖర్చులు, ఎగుమతులపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. క్వింటాలు మిర్చి ధర 11 వేల 781 రూపాయల కంటే తక్కువగా ఉంటే మార్కెట్ జోక్యం కింద కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని చంద్రబాబు నాయుడు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మిర్చి రైతులను ఆదుకుంటామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. టమాటా రైతులకు చేయూత ఇచ్చేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పూస కృషి విజ్ఞాన మేళా 2025ను శివరాజ్ సింగ్ చౌహాన్ నిన్న ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని నిర్ణయాలూ తీసుకుంటున్నామని తెలిపారు. కాగా.. ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి మిర్చి పంటను క్వింటా 11 వేల 781 రూపాయల చొప్పున

కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రం నాగర్‌కర్నూల్ జిల్లాలో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ.. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంలో నిన్న జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. శ్రీశైలం నుంచి మన్నెవారిపల్లి వైపు నీటిని తరలించే ఇన్ లెట్ భాగం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సొరంగం లోపల పనిచేసేందుకు వెళ్లిన కార్మికులు, ఉద్యోగుల్లో 8 మంది అందులో చిక్కుకుపోయారు. 46 మంది ప్రాణాలతో బయటపడ్డారు.

కాగా.. సొరంగంలో చిక్కుకున్న వారిని వేగంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తక్షణ సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్యమంత్రికి ఫోన్ చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. సహకారానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంటనే జాతీయ విపత్తు నిర్వహణ బృందాలను పంపించారు.

---------------------------

సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి మూలాలు గుర్తించి నిర్మూలిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. కృష్ణా జిల్లాలో పట్టుబడిన గంజాయిని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంటులో దగ్ధం చేసే కార్యక్రమాన్ని ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలో ఉందని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో లక్ష కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని.. అందులో 70 వేల కిలోలు ధ్వంసం చేశామని హరీష్‌కుమార్ గుప్తా వివరిస్తూ..

..వాయిస్ (27 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఈ నెల 28వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సరానికి సభలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది. 15 పనిదినాలు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కాగా.. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఆ పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు సభకు హాజరుకానున్నారు.

---------------------------

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. ఏపీపీఎస్సీ స్పష్టంచేసింది. షెడ్యూల్ ప్రకారం.. ఈ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల 30 నిమిషాల వరకు

పేపర్–1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు పేపర్–2 పరీక్ష జరుగుతుందని ఏపీపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థులు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా..92 వేల 250 మంది మెయిన్స్ పరీక్షకు హాజరు కానున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. కాగా.. నిన్న ఉదయం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి కె.పెంచల కిషోర్.. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు రాత్రి భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

---------------------------

"బేటీ బచావో.. బేటీ పఢావో.." పథకం ఒక పరివర్తనాత్మక పథకంగా మారిందని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శాంతకుమారి అన్నారు. భేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మహిళా సంక్షేమ శాఖ మహిళా పోలీస్ సిబ్బందితో నిర్వహించిన బైక్ ర్యాలీని సంయుక్త కలెక్టర్ టి. నిషాంతి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న శాంతకుమారి మాట్లాడుతూ... ఈ పథకం అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసిందన్నారు. గడిచిన పదేళ్లలో లింగ వివక్షలను అధిగమించడంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ....

వాయిస్ ..26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో మరో మూడు గులియన్ బారీ సింద్రోమ్..జీబీఎస్ కేసులు వెలుగు చూశాయి. బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రి న్యూరాలజీ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గడిచిన మూడు రోజుల్లో కొత్తగా ఈ మూడు కేసులు నమోదయ్యాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. జీబీఎస్ బాధితుల్లో గర్భిణి ఆరోగ్య పరిస్థితి కొంత విషమంగా ఉందని, మిగిలిన ఇద్దరు సాధారణ వార్డుల్లోనే చికిత్సలు పొందుతున్నారని వైద్యులు తెలిపారు. దీంతో ఈ నెలలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జీబీఎస్ కేసుల సంఖ్య 13కు చేరింది.

---------------------------

తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపింది. ఈ

మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన ఓ కోళ్ల ఫారంలో వారం రోజుల క్రితం వందల సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. అధికారులు వాటి నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లోని వీబీఆర్ఐ ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల అనంతరం ఆ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిందని నిర్ధారణ జరిగిందని జిల్లా పశువైద్యాధికారి జానయ్య నిన్న తెలిపారు. ఈ మేరకు అధికారులు కోళ్లఫారాన్ని పరిశీలించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 20 లక్షల కనెక్షన్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్ల పైకప్పుపై సౌర పలకల ఏర్పాటు ప్రాజెక్టుకు విధివిధానాలు ఖరారుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సౌర విద్యుత్ పలకలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. లబ్ధిదారుపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేయనుంది. ఆయా వర్గాలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది.

======================